
**కథ**

# మాట్లాడుకుందాం రా!

**పి. సుభాషిణి**



పర్సనాలిటీ డెవలప్‌మెంట్ క్లాసెస్‌కి అటెండ్ అవుతున్నప్పటి నుండి వేణుగోపాల్ మనసు అదే 'వాక్యం' చుట్టూ తిరుగుతోంది.

''భార్యాభర్తలు ఆనందంగా వుండాలంటే వారి మధ్య కమ్యూనికేషన్ గ్యాప్ వుండకూడదు''

'శ్రీలత ఈమధ్య తనతో ముభావంగా, అంటీ ముట్టనట్టుగా వుంటోంది' మనసులోనే అనుకున్నాడు వేణుగోపాల్.

అప్పుడే అతడికి క్లాస్‌లో చెప్పిన మరికొన్ని వాక్యాలూ గుర్తుకొచ్చాయి. 'మీ జీవిత భాగస్వామి ముభావంగా, ఇబ్బందికరంగా ప్రవర్తిస్తుంటే, మీ మధ్య కమ్యూనికేషన్ గ్యాప్ వున్నట్టే.. అప్పుడు మీరిద్దరూ కూర్చుని ఒకరి భావాలు ఒకరికి తెలియజేస్తూ, అసలు సమస్యేంటో మాట్లాడుకోండి'

## తప్పులు తెలియాలంటే...!

**సినిమాతారలు ఎవరికైనా తాము నటించిన అన్ని సినిమాలు హిట్ కావాలనే కోరుకుంటారు. కానీ ఇలియానా మాత్రం మధ్యలో ఒకటి రెండు పరాజయాలైనా ఎదురు కావాలని కోరుకుంటుందిట. ఎందుకంటారా? వరసగా అన్నీ సక్సెస్‌లుంటే ఇక తనలోని లోటుపాట్లు తనకి తెలియవట. అందుకని ఏదైనా సినిమా పరాజయం పాలైతే అందులో తను చేసిన తప్పేంటో తెలుసుకుని మరోసారి అలాంటి పొరపాట్లు చేయకుండా జాగ్రత్తపడవచ్చు అనేది ఇలియానా ఆలోచట. మంచి ఆలోచనే! అంటే 'ఖతర్నాక్' లాంటి సినిమాలు ఆమె కెరీర్‌కి మంచే చేస్తాయన్నమాట!**

అదిగో వేణుగోపాల్‌కి సమస్య అప్పుడే మొదలయింది. అతడు భార్యతో కాసేపు ప్రశాంతంగా మాట్లాడాలనుకున్నాడు.

కానీ నగర జీవితంలో భార్యతోనైనా సరే, ప్రశాంతంగా కాసేపు మాట్లాడటం ఎంత కష్టమో అతడికి మెల్లగా అర్థం కాసాగింది.

ఉదయమే అతడు వంటగదిలోకి వెళ్ళాడు. భార్య భుజం మీద చెయ్యేసి ''లతా!'' అన్నాడు అభిమానం వొలకబోస్తూ.

'' ఆ!'' ఆమె తన పనిలోనే వుండి, తల కూడా తిప్పలేదు.

''ఈరోజు మనం..''

''సినిమాకెళ్తున్నామా నాన్నా?''

అదిరిపడడం వేణుగోపాల్ వంతయింది. మాటలు వినిపించిన వైపు అతడు తలతిప్పి చూసాడు. ఐదేళ్ళ కూతురు సౌమ్య వెనుకే నిలబడివుంది.

అతడికి ఏమనాలో తోచలేదు. అడ్డంగా వూపాడో, నిలువుగా వూపాడో తనకే తెలియదు. తల మాత్రం వూపాడు.

సౌమ్య ఎగిరి గంతేసింది. అక్కడి నుండే అరిచింది ''అన్నయ్యా సాయంత్రం మనం సినిమాకెళ్తున్నామోచ్''

కుడితిలో పడి కొట్టుకుంటున్న ఎలుకలా భార్యకేసి దీనంగా చూసాడు అతడు. ఆమె సన్నగా నవ్వినట్టనిపించింది.

అతడు ఆమె నవ్వును పట్టించుకోదలచుకోలేదు. 'అసలే నెలాఖరు రోజుల్లో సినిమా ఖర్చులకు డబ్బెలా సర్దాలా?' అన్నది ఆలోచిస్తూ ముందు గదిలోకి వెళ్ళిపోయాడు.

ఎలాగోలా డబ్బు సర్దుకుని సినిమాకెళ్ళినా, మనసు సినిమా మీద లగ్నం కాలేదు. 'శ్రీలతతో మనసు విప్పి మాట్లాడాలి'

ఇక ఆపుకోలేక సినిమా మధ్యలోనే భార్యతో ''నేను కాసేపు నీతో మాట్లాడాలి''

''సినిమాకొచ్చింది మాట్లాడుకోవడానికి కాదు. సినిమా చూడండి'' కసిరినట్టే అంది శ్రీలత.

అతడికి తెరమీద బొమ్మలు కదులుతున్నట్టే అనిపించింది. ఎంతమాత్రమూ ఎంజాయ్ చేయలేకపోయాడు.

ఆ రాత్రి ఇంటికెళ్ళి భోంచేసాక, పిల్లలిద్దరూ నిద్రపోయారని నిర్ణయించుకున్నాక మెల్లగా భార్య కాలు గీరాడు.

''అమ్మో ఎలుక'' అరుస్తూ లేచింది శ్రీలత.

''ఏంటమ్మా.. ఏమయ్యింది?'' పిల్లలిద్దరు కూడా లేచి కూర్చున్నారు.

''వెధవ ఎలుకలు ఎక్కువయిపోయాయి. కాలు కొరికినట్టున్నాయి'' అంటూ ఆమె కాలుకేసి చూసుకుంటోంది.

పిల్లిలా పడక మీద ముడుచుకుని పడుకుండిపోయాడు.

మొట్టమొదటిసారి అతడి మదిలో ఆ ప్రశ్న ఉదయించింది. 'నా పెళ్ళాంతో నేను మాట్లాడటం ఇంత కష్టమా?'

ఆ మాటే తన మిత్రుడు రమేష్‌తో అంటే అతడు అన్నాడు.

''పనుల గురించి మాట్లాడడం కష్టం కాదు గానీ, మనసు గురించి మాట్లాడాలంటే కట్టుకున్న భార్యతోనైనా అది కష్టమే''

''ఆ విషయం నాకిప్పుడే అనుభవంలోకి వచ్చింది''


''అందుకే చెపుతున్నాను ఓరోజు ఆఫీసుకు సెలవు పెట్టయినా సరే మీ ఆవిడతో మనసు విప్పి మాట్లాడు'' చెప్పాడు రమేష్.

''అలాగే'' అన్నాడు వేణుగోపాల్.

★ ★ ★

ఆరోజు ఆఫీసుకి సెలవు పెట్టాడు అతడు. 'ఎలాగైనా సరే, ఆరోజు భార్యతో తమ మధ్యనున్న కమ్యూనికేషన్ గ్యాప్ గురించి మాట్లాడాలి' గట్టి నిర్ణయమే తీసుకున్నాడు.

పిల్లలు స్కూల్‌కి వెళ్ళాక వీధి తలుపు గడియవేసాడు. వంట గది వైపు నెమ్మదిగా



డుగులేస్తూ అనుకున్నాడు...'వంట పనిలో శ్రీమతికి సహాయపడుతూ మెల్లగా మాటల్లో దించి, తనీ మధ్య ఎందుకంత ముభావంగా వుందో అడిగి తెలుసుకోవాలి'

వంట గది దగ్గరగా చేరుకున్నాడు గానీ, లోపలికి అడుగుపెట్టకముందే వీధి వాకిలి దగ్గర తలుపు తట్టిన చప్పుడయ్యింది.

ఆ శబ్దం మొదట అపశకునంలా అనిపించింది. అంతలోనే 'బహుశా ఏ సేల్స్ గర్లో అయ్యుంటుంది. ఏదో చెప్పి పంపించేసి మళ్ళీ వంటగదిలో దూరేసెయొచ్చు' అనుకుంటూ డోర్ వైపు నడిచాడు.

తలుపు తీయగానే వేణుగోపాల్ నాలుక తడారింది.

ఎదురుగా- పక్కింటి నీలవేణి నిలబడి వుంది.

ఆమెను చూసి అతడు నవ్వలేక నవ్వాడు.

''ఆఫీసుకి సెలవు పెట్టారా అన్నయ్య గారూ?'' అంటూనే నీలవేణి వంటగదివైపు నడిచింది.

అతడు పడక గదిలోకి వెళ్ళి తలను గోడకేసి కొట్టుకున్నాడు.

నీలవేణి కనీసం రెండు గంటలు కబుర్లు చెప్పి వెళ్ళిపోయాక, అతడు విసురుగా వంట గదివైపు వెళ్ళాడు. శ్రీలతకేసి కోపంగా చూస్తూ ''వచ్చిన మనిషి పది నిముషాలు మాట్లాడి వెళ్ళొచ్చుగా. గంటల తరబడి ఆ కబుర్లేంటి?'' అన్నాడు. ఆ విషయంలో తప్పు తన ఇల్లాలిదో, వచ్చినావిడదో అతడికే అర్థం కాలేదు.

శ్రీలత చాలా కూల్‌గా చూస్తూ పలికింది. ''ప్రతిరోజూ రెండు గంటలు కూర్చుని వెళ్ళే ఆవిడ, ఈరోజు పది నిముషాలే ఎందుకుంటుంది... తనకు రోజూ ఇలా రెండు గంటలు కూర్చుని వెళ్ళడం అలవాటేగా?''

''రోజూ రెండు గంటలు కూర్చుంటుందా?'' ఆశ్చర్యం కాస్త మోతాదు మించింది.

ఆమె అతడి ఆశ్చర్యాన్ని అస్సలు పట్టించుకోలేదు. ''మరి... పిల్లలు స్కూల్‌కి వెళ్ళాక.. మీరు ఆఫీసుకి దయచేసాక, ఈ ఇంట్లో నాకు కాలక్షేపం ఏముంటుంది? ఆ నీలవేణి గారే నాకు కాలక్షేపం కాసింత ఓదార్పు''

వేణుగోపాల్‌కి మూడ్ అవుటయ్యింది. 'ఈ మూడ్‌లో మనసు విప్పి మాట్లాడడం బాగోదు. భోజనాలయ్యాక కాసింత రిలాక్స్‌గా తనను దగ్గరకు తీసుకుని..ఆమె ముంగురులు సవరిస్తూ..మా..ట్లా...డా..లి..'

భోజనాలయ్యాయి.

శ్రీమతితో మనసు విప్పి మాట్లాడడానికి అతడు సిద్ధపడుతుంటే, మరోసారి తలుపు చప్పుడయ్యింది.

ఆమె భర్తవైపు తిరిగి ''ఎదురింటి వెంకటలక్ష్మిగారొచ్చినట్టున్నారు. పాపం! మధ్యాహ్నం నుండి ఆవిడే నాకు కాలక్షేపం..మీరు పడుకోండి'' అనేసి హాల్లోకి వెళ్ళిపోయింది.

వేణుగోపాల్‌కి తన మీద తనకే జాలి కలిగింది.

ఫీలింగ్ ఏదయినా మనసు విప్పి మాట్లాడుకుండానే లీవ్ వేస్టయింది.

వేణుగోపాల్ మర్నాడు మిత్రుడి ముందు ప్రత్యక్షమై, తన గోడు వెళ్ళబోసుకున్నాడు... ఆఫీస్ లీవ్ ఎలా వేస్టయ్యిందో చెప్పాడు.

రమేష్ చాలా దీర్ఘంగా ఆ...లోచించాడు.

''పోనీ మీ ఆవిడను తీసుకుని ఏ పార్క్‌కో వెళితే?''

''అమ్మా నాన్న పార్క్‌కి వెళుతుంటే ఐదేళ్ళ కూతురు, ఏడేళ్ళ కొడుకు వెంట రాకుండా వుంటారా?'' వేణుగోపాల్ మిత్రుడికేసి సీరియస్‌గా చూసాడు.

''అదీ నిజమే'' నాలుక్కరుచుకున్నాడు రమేష్. తనలో తాను అనుకుంటున్నట్టు పైకే పలికాడు. ''ఈ ప్రపంచంలో ఎక్కువ శాతం భార్యాభర్తల మధ్య ఏదో సమయంలో కమ్యూనికేషన్ గ్యాప్ వస్తుంది. వాళ్లు రోజూ మాట్లాడుకోవచ్చుగానీ, మనసు విప్పి మాట్లాడుకోవడం తగ్గిపోతుంది. అలాంటి సమయంలో ఏకాంతం దొరకడమూ కష్టమవుతుంది. మరి భార్యాభర్తలు మనసు విప్పి ప్రశాంతంగా మాట్లాడుకోవాలంటే ఏం చేయాలి?''

ఒక మార్గం కనిపించింది. అదే అతడికి చెప్పాడు ''పోనీ! చాలా సంవత్సరాలయ్యింది కదా? పల్లెటూర్లోని మీ అత్తమామల దగ్గరకు పదిరోజులు వెళ్ళి రాకూడదూ?''

వేణుగోపాల్ ఆకాశంలోకి అదోలా చూసాడు ''మా అత్తామామల ఇంటికా?'' అన్నాడు.

''అవును''

''సరే! ఆ ప్రయత్నమూ చేస్తా'' పలికాడు.

★ ★ ★


అప్పుడే పిల్లలకు స్కూల్ హాలిడేస్ కూడా కలిసిరావడంతో భార్యాపిల్లలను ఆ పల్లెకు బయల్దేరదీసాడు వేణుగోపాల్.


పల్లెలో బస్సు దిగాక మామాగారు వీరభద్రయ్య ఎదురొచ్చి తీసుకె

## మరో 'కజ్‌రారే..'

**'బంటీ ఔర్ బబ్లీ'లో 'కజ్‌రారే...' పాట ఎంతగా హిట్ అయిందో అందరికీ తెలుసు. తండ్రీ కొడుకులు అమితాబ్-అభిషేక్‌లతో ఐశ్వర్య చేసిన ఈ సాంగ్ సూపర్ హిట్టయింది. అలాగే తన ఐటమ్ సాంగ్ కూడా హిట్ అవుతుందని భావిస్తోంది ఊర్మిళ. రామ్‌గోపాల్ వర్మ నిర్మిస్తున్న 'షోలే' సినిమాలో 'మెహబూబా' పాట (పాత షోలేలో హెలెన్ చేసిన పాట)లో అమితాబ్-అభిషేక్‌లతో కలిసి నటించినందుకు తెగ సంబరపడిపోతోంది ఊర్మిళ. ఆమె ఆశిస్తున్నట్టుగా ఆ ఐటమ్ సాంగ్ ఆమెకి ఎంత పేరు తెస్తుందో చూద్దాం!**





ళ్ళాడు.

నాల్గైదేళ్ళ తర్వాత ఆ పల్లెకు వచ్చాడు అతడు. ఆ వాతావరణంలో అడుగుపెట్టంతోనే సేదతీరిన అనుభూతి కలిగింది.

అప్పుడే అతడు భార్య ముఖంలోకి చూసాడు. ఆశ్చర్యం? శ్రీలత ముఖంలో సరి కొత్త ఆనందం కనిపిస్తోంది.

అతడలా ఆమె ముఖంలోకి చూస్తుండగానే అదేమీ పట్టించుకోని శ్రీలత భర్త చేతిని తన రెండు చేతులతో పట్టేసుకుని ''మా ఊరు చాలా బాగుంటుంది కదండీ?'' అంది.

''ఆ!'' అన్నాడు అతడు.

అందరూ ఇల్లు చేరుకున్నారు.

అత్తగారు శేషమాంబ ఆప్యాయంగా పలకరించింది. కూతురు తల్లిని గట్టిగా కౌగిలించేసుకుంది.

ఒకరోజు గడిచింది.

'శ్రీలత ఆనందంగా వుండడం, తనతో ఉత్సాహంగా మాట్లాడడం' గమనిస్తూనే వున్నా, సిటీలో ఏర్పడిన 'కమ్యూనికేషన్ గ్యాప్' గురించి మాట్లాడాలనే అనుకుంటున్నాడు. అసలు తను ఆ పల్లెకు వచ్చిందే ఆ పని మీదనే కదా?'

ఆ మధ్యాహ్నం అతడు ఆమెతో అన్నాడు ''మధ్యాహ్నం మనిద్దరం అలా మీ తోట వరకూ వెళ్ళొద్దాం?''

'ఎందుకు?' అని ఆమె ప్రశ్నిస్తుందనుకున్నాడు. అలా అనలేదు. పైగా ఉత్సాహంగా ''అలాగే'' అంది శ్రీలత.

మధ్యాహ్నం వాళ్ళిద్దరూ మామిడితోట వైపు వెళ్ళబోతుంటే, అతడూహించినట్టే పిల్లలిద్దరూ ''మేమూ తోటకొస్తాం..మేమూ వస్తాం'' అన్నారు.

శేషమాంబ వెంటనే ''ఒరేయ్! మీ తాతయ్య ఎడ్లబండిలో పొలం వెళ్తున్నారు. తోటకెందుకు? పొలానికెళ్ళండి'' అంది.

''ఎడ్లబండి ఎక్కడమా? ఓహో!...అయితే మేము తాతయ్యతోనే వెళ్తాం'' అన్నారు పిల్లలిద్దరూ.

వేణుగోపాల్ ఊపిరి పీల్చుకున్నాడు.

భార్యాభర్తలిద్దరూ ఇంటి పక్కనే వున్న మామిడితోట వైపు నడిచారు.

ఇద్దరూ మోటార్ పంప్ దగ్గర ఎదురెదురుగా కూర్చుంటే, ఎందుకో తెలియదు, 'జీవితంలో సాధించలేనిది సాధించానన్న ఆనందం' కలిగింది వేణుగోపాల్‌కి. ఆ ఏకాంతం అపురూపంగా, అనిర్వచనీయంగా తోచింది.

అప్పుడే అతడు భార్య ముఖంలోకి చూసాడు. ఆమె ముఖంలోనూ ఏదో తెలియని ఆనందం వెలుగులు చిమ్ముతుంది.

అంతలోనే అతడికి తను ఆ పల్లెకొచ్చిన పని గుర్తుకొచ్చింది. పర్సనాలిటీ డెవలప్‌మెంట్ క్లాసుల్లో చెప్పిన వాక్యం మనసులో కదలాడింది.

ఒకటి, రెండు మాటలు మాట్లాడాక అసలు విషయం మొదలుపెడుతూ అతడు గొంతు సవరించుకున్నాడు ''లతా?''

ఎంతో కాలం తర్వాత ఏర్పడిన ఏకాంతంలో కొత్త పెళ్ళికూతురులా సిగ్గులుపోతున్న ఆమె తలెత్తకుండానే ''ఆ!'' జవాబిచ్చింది.

''నేను..నేను నీతో ఓ విషయం మనసు విప్పి మాట్లాడాలని ఇక్కడివరకూ తీసుకొచ్చాను.''

ఆమె అదిరిపడి తలెత్తి చూసింది. 'మనసు విప్పి' అనే మాట అతడు వత్తి పలకడంతో తన ఊహలు ఎక్కడెక్కడికో వెళ్ళిపోయాయి. 'కొంపదీసి మనసు విప్పడమంటే మనసులో వున్న మరో స్త్రీ గురించి చెప్పడమా?'

''ఏ...ఏమిటది?''

అతడు ఆమె ముఖంలోకే సూటిగా చూడసాగాడు. అది కూడా అతడు పర్సనాలిటీ డెవలప్‌మెంట్ క్లాసుల ద్వారా నేర్చుకున్న పాఠమే.

'ఎన్నాళ్ళో వేచిన సమయం. ఈనాడే ఎదురవుతుంటే..' అన్నట్టుగా ఆ క్షణం అతడి మనసు దూదిపింజలా మారినట్టు తేలికయిసాగింది.

''అది..అది..ఈమధ్య నువ్వు నాతో ముభావంగా, అంటీ అంటనట్టుగా ప్రవర్తిస్తున్నావ్''

అతడేమన్నాడో ఆమెకు కొద్దిక్షణాలపాటు అర్థం కాలేదు. అర్థమయ్యాక పెద్దగా, ఆ ప్రశాంత వాతావరణంలో ప్రతి ధ్వనించేలా నవ్వింది.

వేణుగోపాల్ భార్యకేసి చిత్రంగా చూడసాగాడు.

''ఇది..ఇదేనా మీరు నాతో మనసు విప్పి మాట్లాడాలనుకుంది?'' ఆమె నవ్వుతూనే వుంది.

''అవును''

ఆమె నవ్వు ఆపింది. తనకూ మనసు తేలికయ్యిందేమో! దాంతోపాటే భర్తమీద ప్రేమ పొంగుకొచ్చింది. కూర్చున్న చోటు నుండి లేచి నెమ్మదిగా భర్త దగ్గరగా వెళ్ళి, కళ్ళల్లో కళ్ళు పెట్టి చూసింది.

''ఎందుకో తెలియదు. ఈమధ్య నాక్కూడా ఇదే ఫీలింగ్. మన మధ్య ఎందుకో తెలియకుండానే ఏదో తెలియని దూరం పెరుగుతున్నట్టు అనిపిస్తోంది. కానీ ఆలోచించలేదు. ఇక్కడికొచ్చాక ఈ వాతావరణానికి, మన బిజీ లైఫ్‌కి బేరీజు వేసుకుంటే కారణం తెలిసింది. రొటీన్!...మాట్లాడుకోవడానికి 'రొటీన్' మాటలు తప్ప మరేం వుండడం లేదు. మనసు విప్పి మాట్లాడుకోవాలన్నా అనుకూలించని వాతావరణం. అక్కడ మనం ఓ రొటీన్ చక్రంలో, అనాలోచితంగా తిరుగుతున్నాం. ఒక వేళ పరిస్థితి అర్థం చేసుకున్నా, మార్చుకోలేని వాతావరణం... అంతే! అంతకుమించి మీతో ముభావంగా వుండడానికి మరో కారణం కనిపించడం లేదు..''

అతడు చూపులు మరల్చుకున్నాడు. 'నిజమే! శ్రీలత తనతో ముభావంగా వుండడానికి ఇంతకుమించిన కారణమేముంటుంది? సిటీలోని రొటీన్‌లైఫ్‌లో ఇలాంటి పరిస్థితులు మామూలే! 'మార్చుకావాలి' అనుకుంటే మాత్రం మనిషి ఆలోచించాలి..' మనసులోనే అనుకున్నాడు.

తనతో మనసు విప్పి మాట్లాడాలనుకోవడం వెనుక వున్న బాధ, వ్యధ అర్థం చేసుకోవడం వల్లకాబోలు శ్రీలతకు భర్త మీద అపరిమితమైన ప్రేమ పొంగుకొచ్చింది. అలాగే వంగి అతడి తలను తన గుండెల దగ్గరకు తీసుకుంది.

'ఇదే కదా నాక్కావలసింది' అతడి మనసు ప్రశాంతతను ఆహ్వానించింది.

☆